
సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



రాట్నాలమ్మ తిరునాళ్ల

రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం నుంచి 27వ తేదీ వరకు తిరునాళ్లు నిర్వహించనున్నారు. 8లో ▸



వైఎస్సార్‌సీపీలో చేరికలు

ఎన్నికల సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



వ్యక్తి దారుణహత్య

పాతకక్షల నేపథ్యంలో పెదవేగి మండలంలోని భోగాపురం గ్రామంలో రంగారావు అనే వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. 8లో ▸

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా గంటా



గంటాకు నియామక పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లిందలపర్రు మాజీ సర్పంచ్ గంటా శ్రీనివాస్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం తూర్పుపాలెంలో జరిగిన కార్యక్రమంలో గంటా శ్రీనివాస్‌ను అభినందిస్తూ నియామక పత్రం అందించారు. దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. గంటా మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ కేవీ నారాయణరెడ్డి (వాసు), పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్లు

భీమవరం(ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నాల్గో రోజు సోమవారం నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున మన్నే లీల రామ్‌నరేంద్ర ఒక సెట్టు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్‌కు సమర్పించారు. అలాగే జిల్లాలో పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక అభ్యర్థి, తణుకులో ఇద్దరు, ఆచంటలో ఒక అభ్యర్థి, ఉండిలో ముగ్గురు, భీమవరంలో ఇద్దరు, నరసాపురంలో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ (ఏప్రిల్ 18) ప్రారంభమైన నాటి నుంచి నరసాపురం ఎంపీ స్థానానికి ఏడుగురు అభ్యర్థులు తొమ్మిది సెట్లు నామినేషన్లను సమర్పించారన్నారు. అలాగే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 37 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు స్పష్టం చేశారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం కొనసాగింది. ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి ఐదు, జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు 18 నామినేషన్లు దాఖలయ్యాయి.

పాలిసెట్‌కు పటిష్ట ఏర్పాట్లు

డీఆర్వో ఉదయ భాస్కరరావు



పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో ఉదయభాస్కరరావు

భీమవరం: జిల్లాలో ఈనెల 27న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు తెలిపారు. సోమవారం డీఆర్వో చాంబర్‌లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష–2024పై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 22 కేంద్రాల్లో పరీక్షలకు 7,329 మంది హాజరవుతున్నట్టు చెప్పారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని, ఇప్పటికే హాల్‌టికెట్లు జారీ చేశామన్నారు. పోలీసు బందోబస్తు, కేంద్రాల్లో తాగునీరు ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలనీ, 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, మున్సిపల్, విద్యుత్, ఆర్టీసీ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీసీసీ పరీక్షలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 33 మందికి 17 మంది, డ్రాయింగ్ హయ్యర్ పరీక్షకు 11 మందికి 8 మంది హాజరయ్యారు. అలాగే టైలరింగ్ లోయర్ పరీక్షకు 42 మందికి 21 మంది, టైలరింగ్ హయ్యర్ పరీక్షకు 25 మందికి 18 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు.

పదిలో బాలికలదే హవా

- టెన్త్ పరీక్షా ఫలితాల విడుదల
- జిల్లాలో 81.82 శాతం ఉత్తీర్ణత
- గణనీయంగా పెరిగిన ఉత్తీర్ణతా శాతం
- సత్తాచాటిన ప్రభుత్వ బడుల విద్యార్థులు



పాలకొల్లు బీవీఆర్‌ఎం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో పశ్చిమగోదావరి జిల్లా 81.82 శాతం ఉత్తీర్ణత సాధించింది. బాలికలు 84.80 శాతం ఉత్తీర్ణతతో బాలికలు పైచేయి సాధించారు. గతేడాది పరీక్షా ఫలితాల్లో 64 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 23వ స్థానంలో నిలవగా ఈ ఏడాదీ 81.82 శాతం ఉత్తీర్ణత సాధించి అదే స్థానంలో నిలవడం విశేషం. మార్చి 18 నుంచి 30 వరకు జిల్లాలోని 127 కేంద్రాల్లో పరీక్షలకు 20,785 మంది విద్యార్థులు హాజరుకాగా 17,007 మంది ఉత్తీర్ణత సాధించారు. 10,313 మందికి బాలికలకు 8,745 మంది, 10,472 మంది బాలురకు 8,745 మంది పాసయ్యారని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు.

ఉత్తీర్ణత శాతాలు ఇలా..

జిల్లాలో ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు 96.68 శాతం, సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు 94.44 శాతం, ఎయిడెడ్ స్కూల్స్ విద్యార్థులు 56.16 శాతం, బీసీ వెల్ఫేర్ స్కూల్స్ విద్యార్థులు 96.52 శాతం, ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులు 75.40 శాతం, మున్సిపల్ స్కూల్స్ విద్యార్థులు 70.14 శాతం ఉత్తీర్ణత సాధించారు.

రీకౌంటింగ్‌కు అవకాశం

విద్యార్థులు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 23 నుంచి 30వ తేదీలోపు స్కూల్స్ హెచ్‌ఎంలకు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వెంకటరమణ తెలిపారు. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1,000 చెల్లించాలన్నారు. ఫీజును సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలానా ద్వారా చెల్లిస్తే ఆమోదిస్తారన్నారు.

వచ్చేనెల 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు మే 24వ తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 3 వరకు నిర్వహిస్తారని దీనికి అపరాధ రుసుం లేకుండా ఈనెల 23వ తేదీ నుంచి 30 వరకు ఫీజు చెల్లించవచ్చునన్నారు. అలాగే రూ. 50 అపరాధ రుసుంతో మే 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు చెల్లించే అవకాశముందని డీఈఓ తెలిపారు.



మట్టా సింధు (588), ఎంపీ పాలెం



గుబ్బల మీనాక్షి (588), మట్లపాలెం

	విద్యార్థులు	ఉత్తీర్ణులు
బాలురు	10,472	8,745
బాలికలు	10,313	8,262
మొత్తం	20,785	17,007

బీసీ గురుకులాల్లో విఘ్నేష్



బి.విఘ్నేష్

నరసాపురం రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని బీసీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో నరసాపురం మహాత్మా జ్యోతిబా పూలే మత్స్యకార బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి బి.విఘ్నేష్ 581 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ గోటేటి వేణుగోపాలకృష్ణ తెలిపారు. జిల్లాలో 8 బీసీ గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. తమ పాఠశాలలో 36 మందికి 34 మంది ప్రథమ శ్రేణిలో, ఒకరు ద్వితీయ, ఒకరు తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారన్నారు. 10 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారన్నారు.

మేనేజ్‌మెంట్ల వారీగా ఉత్తీర్ణతా శాతం

- జెడ్పీ హైస్కూల్ : 9,851 మంది విద్యార్థులకు 7,149 మంది ఉత్తీర్ణత సాధించారు.
- ఎయిడెడ్ స్కూల్స్ : 333 మందికి 187 మంది పాసయ్యారు.
- బీసీ వెల్ఫేర్ స్కూల్స్ : 201 మందికి 194 మంది ఉత్తీర్ణత సాధించారు.
- ప్రభుత్వ పాఠశాలలు : 435 మందికి 328 మంది పాసయ్యారు.
- మున్సిపల్ స్కూల్స్ : 1,805 మందికి 1,266 మంది ఉత్తీర్ణులయ్యారు.
- ప్రైవేట్ స్కూల్స్ : 7,872 మందికి 7,611 మంది పాసయ్యారు.

సీఏ చేయాలని ఉంది



మా పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పాఠశాలలు అభివృద్ధి చేయడం, నూతన బల్లలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వల్ల ప్రశాంత వాతావరణంలో విద్యాబోధన జరిగింది. సీఏ చేయడమే నా లక్ష్యం.

– పూసరపు హర్షిణి (585), బీవీఆర్‌ఎం బాలికోన్నత పాఠశాల, పాలకొల్లు

ఐఏఎస్ కావాలని..



మా పాఠశాలలో సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ప్రతి తరగతిలో ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఎఫ్ఏ–1, ఎఫ్ఏ–2 పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. దీంతో పోటీతత్వం పెరిగింది. ఐఏఎస్ కావడమే నా లక్ష్యం.

– కవురు జాహ్నవి (584), బీవీఆర్‌ఎం బాలికోన్నత పాఠశాల, పాలకొల్లు

ఇంజనీర్ అవుతా..



రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదవడం అదృష్టంగా భావిస్తున్నాను. పదో తరగతి పరీక్షల్లో 584 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉంది. ఇంజనీర్ కావాలన్నదే నా ధ్యేయం. పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎంతో రుణపడి ఉంటాను.

– జక్కంశెట్టి రిబ్కా (584), జెడ్పీ హైస్కూల్, రాయకుదురు

ఐఐఐటీలో సీటు సాధించి..



ప్రభుత్వం ఇటీవల కాలంలో కల్పించిన వసతులతో చదువుపై విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతోంది. మా స్కూల్‌లో కల్పించిన వసతులు నా చదువుకు బాగా దోహదపడ్డాయి. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇదే ప్రోత్సాహంతో ఐఐఐటీలో సీటు సాధించి కంప్యూటర్ ఇంజనీర్‌గా స్థిరపడతా.

– భీమవరపు దివ్యశ్రీలక్ష్మి (581), పీఎస్ఎం మున్సిపల్ హైస్కూల్, భీమవరం

సైలెన్సర్లు తీయొద్దు మహాప్రభో..



భీమవరంలో జనసేన కార్యాలయం నుంచి విడుదల చేసిన నోట్



భీమవరం: తన నామినేషన్ కార్యక్రమానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు బైక్‌ల సైలెన్సర్లు తీయొద్దంటూ జనసేన పార్టీ భీమవరం నియోజకవర్గ అభ్యర్థి పార్టీ కేడర్‌ను వేడుకోవడం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. భీమవరం జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఇటీవలే టీడీపీ నుంచి జనసేనలో చేరి టికెట్ పొందారు. ఈనెల 24న నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా కేడర్‌నుద్దేశించి పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో ప్రత్యేకంగా 'నోట్' అని పేర్కొని మరీ.. 'ద్విచక్ర వాహనదారులందరూ ఏవిధమైన శబ్దాలూ చేయకుండా (సైలెన్సర్లు తీయకుండా) క్రమశిక్షణతో కార్యక్రమంలో పాల్గొనాలి. ఎలక్షన్ కోడ్ నిబంధనలు పాటించాలి' అని విజ్ఞప్తి చేయడం గమనార్హం. ఇది చూస్తే జనసేనలోని అల్లరి మూకల కారణంగా తనకున్న కొద్దిపాటి ఇమేజ్ కూడా పోతుందనే భయంతో అంజిబాబు వేడుకోలు చేసుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. పవన్‌కల్యాణ్ పర్యటనలో జనసేన నాయకులు, కార్యకర్తల్లో కొంతమంది బైక్‌ల సైలెన్సర్లు ఊడదీసి భరించలేని శబ్దాలతో గందరగోళం సృష్టించడం పరిపాటి. దీంతో పట్టణంలోని ప్రజలు, ప్రయాణికులు జనసేన పార్టీపై తీవ్రంగా దుమ్మెత్తిపోస్తున్నారు. ఐదేళ్లుగా ప్రజలకు కనిపించని అంజిబాబుపై ప్రజల నుంచి సానుకూల వాతావరణం లేకపోవడంతో ఉన్న కాస్త ఇమేజ్ పార్టీ కేడర్ అల్లరి వల్ల తుడిచిపెట్టుకుపోతుందని భయపడి.. ఇలా విజ్ఞప్తి చేయడం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

చంద్రబాబు కూటమికి తిరస్కారం తప్పదు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఓట్లు అభ్యర్థిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల

పెంటపాడు: ఐదేళ్లపాటు ప్రజా సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజలు గుర్తించారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని జట్లపాలెం, మౌంజిపాడు, పడమర విప్పర్రు, ఉమామహేశ్వరం, యానాలపల్లి, పరిమెళ్ల గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల కనకసుందరరావుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్లాది కుటుంబాలకు జగనన్న చేసిన మేలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ప్రజల ఆ జ్ఞాపకాన్ని ఏ కూటమి తొలగించలేదన్నారు. అవినీతి లేని పాలన జగనన్న అందించారన్నారు. సంక్షేమ పాలన జగనన్నకే సొంతమన్నారు. చెప్పుకునేందుకు ఒక్క పథకం లేకుండా రాష్ట్రాన్ని 14 ఏళ్లు పరిపాలించానని గొప్పలకు పోతున్న చంద్రబాబు అండ్ కూటమిని ప్రజలు తిరస్కరించడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వల్ల లబ్ధి పొందిన ప్రతి అవ్వా, తాతా, ఇళ్ల లబ్ధిదారులు, ఆసరా, చేయూత తదితర పథకాలు పొందిన వారు మరలా జగనన్నను సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుస్తుందన్న పలు నిష్పక్షపాత సర్వేలు కూడా జగనన్న వైపే ఉన్నాయన్నారు. గ్రామ కూడళ్లలో కొట్టు సత్యనారాయణకు మహిళలు హారతులు ఇచ్చారు. యువత రోడ్డు షోలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల కనకసుందరరావు మాట్లాడుతూ అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్య సురక్ష, సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లు, పలు ఉద్యోగాలు కల్పించిన జగన్‌కే ప్రజల మద్దతు ఉందన్నారు. మరలా ఓటు వేసి రుణం తీర్చుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, పార్టీ నాయకులు గుండుమోగుల సాంబయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, పలు గ్రామాల సర్పంచ్‌లు గొర్రెల కోటేశ్వరరావు, ఖండవల్లి మణిరాజు, మద్దుకూరి నాగేశ్వరరావు, తెంటు జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు కట్టుబోయిన వెంకటలక్ష్మి, యండ సరస్వతి, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ సభ్యులు కోసూరి వెంకట్రాజు, పార్టీ అధ్యక్షుడు బోణం వీరయ్య ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నివర్గాలకూ లబ్ధి

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



గుమ్మలూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గుమ్మలూరు శివారు పైడావ, తోటమెరక, చినపేట, పోడూరు శివారు అంబటివానిచెరువు, నంబూరివారిగరువు, కుమ్మరిగుంట తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల శంఖారావ పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అవ్వాతాతలు, మహిళలు, రైతులు, చేతివృత్తిదారులు, చిరు వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లను సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై వేసి తనను ఎమ్మెల్యేగా తిరిగి భారీ మెజార్టీతో గెలిపించడంతో పాటు నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు గొట్టుముక్కల సోనియారమేష్, శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎంపీటీసీలు పోతాబత్తుల శ్రీలక్ష్మీదుర్గ, అంబటి సుధాకర్, నాయకులు ఉన్నారు.

జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



కేపీ పాలెం సౌత్ గ్రామంలో మహిళను ఓట్లు అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించడంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందంజలో ఉంటారని చీఫ్ విప్, నరసాపురం వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని కేపీపాలెం సౌత్ పంచాయతీలోని బెల్లంకొండవారి మెరక, యాళ్లవారి మెరక, మల్లిపూడివారిమెరక తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాలైన పేరుపాలెం సౌత్, నార్త్, కేపీ పాలెం నార్త్, సౌత్ గ్రామాల అభివృద్ధిలో వైఎస్సార్ పాత్ర ఉందన్నారు. అలాగే సీఎం జగన్ హయాంలో బియ్యపుతిప్ప నుంచి మోళ్లపర్రు వయా కేపీ పాలెం నార్త్ వరకు రూ.4.30 కోట్లతో రహదారి నిర్మించామని, మెట్రేవు నుంచి అల్లం వారి మెరక, మోళ్లపర్రు బీచ్ వరకు రూ.8 కోట్ల రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ముత్యాలపల్లి, మోళ్లపర్రు బీచ్ వయా మోడి పేరుపాలెం సెంటర్ వరకు రూ.28 కోట్లతో చేపట్టిన రహదారి పనులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. కేపీపాలెం నుంచి మొగల్తూరు వయా కొత్తకాయలతిప్ప రహదారి పనులు పూర్తయ్యాయన్నారు. బీచ్‌లకు వచ్చే రోడ్లను కలుపుతూ నూతన రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌ల అభివృద్ధిలో సీఎం జగన పాత్ర ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే నరసాపురం అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ కడలి సోంబాబు, ఎంపీటీసీ సభ్యులు డీవీవి సత్యనారాయణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కడలి గంగాభవాని, నాయకులు ఉన్నారు.

అభ్యర్థుల ఖర్చుపై నిరంతర నిఘా

ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్



మాట్లాడుతున్న నీనా నిగమ్. చిత్రంలో కలెక్టర్, ఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల ప్రచారంలో వ్యయ పరిమితికి మించి ఖర్చు చేసే అవకాశం ఉన్న అభ్యర్థులపై నిరంతర నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమన్వయ కమిటీలు, నోడల్ అధికారులతో సీజర్ నిర్వహణ, ఖర్చుల వివరాలు, ఆడిటింగ్‌పై ఆమె సమీక్షించారు. నామినేషన్లు ప్రారంభం అయిన దృష్ట్యా తనిఖీలు ముమ్మరం చేయాలని, సాధారణ పౌరులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అభ్యర్థుల ఖర్చులను వారి ఖాతాల్లో చూపడంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, భారీ మొత్తంలో జరిగే లావాదేవీలు, నగదు డిపాజిట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మద్యం అమ్మకాలు, స్టాక్ షాపులకు వెళ్లే సరకు రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల ప్రచార తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు.

ప్రత్యేక బృందాలతో.. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ జిల్లాలో వ్యయ పర్యవేక్షణ బృందాల పనితీరును వివరించారు. ప్రచార ర్యాలీలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి రికార్డు చేస్తున్నామన్నారు.

పటిష్ట నిఘా : జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ జిల్లా సరిహద్దుగా ఏర్పాటుచేసిన ఐదు చెక్ పోస్టులు, పనితీరు, సిబ్బంది, తనిఖీలు, సీజ్ చేసిన నగదు, బంగారం, గంజాయి వంటి వాటి వివరాలు వెల్లడించారు. చివరిగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఎంసీఎంసీ సెంటర్‌ను రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ పరిశీలించారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కె.సంగీత్ మాథూర్, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డీటీ ఎం.సన్యాసిరావు ఉన్నారు.

హోమ్ ఓటింగ్‌కు చివరి అవకాశం

ఏలూరు(మెట్రో): పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వినియోగించుకోలేనివారు హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఈ మేరకు అర్హుల ఇంటి వద్దకే వెళ్లి బీఎల్‌ఓలు ఫారం–12(డి) అందిస్తున్నారన్నారు. ఈనెల 23 వరకు ఈ ప్రక్రియ సాగుతుందని, దరఖాస్తును పూరించి ఈనెల 23లోపు సెక్టోరల్ అధికారులకు అందించాలన్నారు. వీటిని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పరిశీలించి వచ్చేనెల 2 నుంచి 5వ తేదీలోపు ఓటు వేసే అవకాశం కల్పిస్తారన్నారు.

రోగులకు ఎనీటైమ్ ఆక్సిజన్

- తణుకు జిల్లా ఆస్పత్రిలో నిరంతరం అందుబాటులో ప్రాణవాయువు
- కోవిడ్ ఇబ్బందులతో రెండు ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటు

తణుకు అర్బన్ : మానవాళి మనుగడకు ప్రాణవాయువు ప్రాధాన్యత ఏంటో కోవిడ్ గుణపాఠం నేర్పింది. ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ విజృంభణతో యావత్ మానవాళి ఊపిరితిత్తుల వ్యవస్థ పాడైపోయి చాలా ఇబ్బందులు పడ్డారు. ఊహాకందని ఉపద్రవం ముంచుకు రావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ కోట్లాది రూపాయలు వెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రూ. 1.06 కోట్లు నిధులువెచ్చించి నిముషానికి వెయ్యి లీటర్లు గాలి నుంచే ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌తోపాటు మరొక లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేశారు. దీంతో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిరంతరాయంగా రోగులకు ఆక్సిజన్ సరఫరా జరుగుతోంది.


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గాలి ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి అయ్యే ప్లాంట్

150 పడకలకు నిరంతర ఆక్సిజన్ సరఫరా

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి 150 పడకలతో చుట్టుపక్కల ఉన్న 100 గ్రామాలకు పెద్దానుపత్రిగా వైద్యసేవలందిస్తోంది. నిత్యం 500లకు పైగా అవుట్ పేషెంట్స్ వస్తుండగా ప్రతి రోజూ 150 పడకలు నిండి ఉండే పరిస్థితి. దీంతో కోవిడ్ అనంతరం ఆస్పత్రి ఆవరణలో రెండు ఆక్సిజన్ ప్లాంట్స్ ఏర్పాటుతో పాటు ప్రతి బెడ్ వద్దకు పైపులైన్ ద్వారా ఆక్సిజన్ సరఫరా అయ్యే విధంగా పరికరాలను ఏర్పాటుచేశారు. ముఖ్యంగా ఎస్ఎన్‌సీయూ (చంటి పిల్లల విభాగం), అత్యవసర విభాగం, ఆపరేషన్ థియేటర్ విభాగాలకు ఈ తరహా ఆక్సిజన్ సరఫరా చాలా ఉపయోగపడుతోంది. గతంలో కేవలం సిలిండర్‌లలోకి ఆక్సిజన్‌ను నింపి సరఫరా చేయాల్సి ఉండగా కోవిడ్ అనంతరం ఆధునిక పరికరాలతో నిరంతర ఆక్సిజన్ సరఫరాకు సుగమమైంది.

ప్రాణాలు నిలిపాం



కోవిడ్ సమయంలో ప్రాణవాయువు అధికంగా అవసరమైన నేపథ్యంలో ఆక్సిజన్ సిలిండర్‌లను సమకూర్చుకుని ఏ ఇబ్బంది తలెత్తకుండా సఫలీకృతులయ్యాం. కోవిడ్ లాంటి పరిస్థితులను అధిగమించే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కోట్లాది రూపాయిలు వెచ్చించి రెండు ఆక్సిజన్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పుడు రోగి బెడ్ వద్దకే ఆక్సిజన్ సరఫరా జరుగుతోంది.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి

వైద్యసేవలు భేష్..



జగన్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని అన్ని రకాలుగా అభివృద్ధి చేశారు. ఆధునిక పరికరాల ఏర్పాటుతోపాటు నాణ్యమైన వైద్యులను అందుబాటులో ఉంచి పేద రోగులకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. ముఖ్యమైన అన్ని విభాగాల ఏర్పాటుతో పేదరోగులు ఉచిత వైద్యాన్ని పొందుతూ వైద్య సేవలను కొనియాడుతున్నారు.

– బెజ్జవరపు హేమశ్రీ, పట్టణ బీసీ సెల్ మహిళాధ్యక్షురాలు

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సునీల్ నామినేషన్



ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ మంగళవారం నామినేషన్ వేయనున్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో ఉదయం నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏలూరు జూట్‌మిల్లు సెంటర్ అల్లూరి విగ్రహం నుంచి మంగళవారం ఉదయం 9 గంటలకు భారీ ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. తొలుత ద్వారకాతిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం ఆయన ఏలూరు చేరుకుంటారు. ఇప్పటికే ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన సునీల్ కుమార్ నామినేషన్‌కు భారీ ఎత్తున వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, నేతలు తరలిరానున్నారు. నామినేషన్ కార్యక్రమానికి జిల్లాలోని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరుకానున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

టెన్త్ ఫలితాల్లో 'విశ్వకవి' విజయకేతనం


విశ్వకవి స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: పదో తరగతి ఫలితాల్లో విశ్వకవి స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని స్కూల్ కరస్పాండెంట్ పొట్లూరి రఘుబాబు సోమవారం చెప్పారు. కె.దుర్గాశ్రీఅక్షయ 585 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలవగా, ఎం.అక్షయ 583 మార్కులతో ద్వితీయస్థానం, జి.భార్గవ్‌సాయికుమార్ 578 మార్కులతో తృతీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. తమ స్కూల్ నుంచి పదో తరగతి పరీక్షలకు మొత్తం 36 మంది విద్యార్థులు హాజరుకాగా, నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని, 28 మంది 500 పైగా మార్కులు సాధించారని చెప్పారు. తమ స్కూల్‌లో చదువులోనే కాక అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తూ విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్నామని రఘుబాబు వివరించారు.

'పది'లో శ్రీకాకతీయ విద్యార్థుల ప్రతిభ


అత్యధిక మార్కులు సాధించిన శ్రీకాకతీయ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని శ్రీకాకతీయ మెరిట్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమైన మార్కులతో విజయం సాధించారని స్కూల్ కరస్పాండెంట్ అక్కినేని కృష్ణకిషోర్ సోమవారం చెప్పారు. వీరిలో సత్తి భువన సాహితి 590, తూములూరి నాగవెంకటయోగితాశ్రీ 584, చింతల రేవతి 575, రేవు యమున 567, దాసం రాఘవేంద్ర నాగసాయి 565 మార్కులు సాధించగా, మరో 24 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారని కృష్ణకిషోర్ వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కృష్ణకిషోర్ అభినందించారు.

టెన్త్‌లో సత్తా చాటిన ఆదిత్య విద్యార్థులు


టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆదిత్యస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని స్కూల్ డైరెక్టర్ ఆదిత్యకృష్ణంరాజు సోమవారం చెప్పారు. తమ స్కూల్ విద్యార్థులు 54 మంది 540 పైగా మార్కులు సాధించగా, 80 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారన్నారు. వీరిలో జి.మనస్విని 592, టి.లక్ష్మీప్రసీద 588, ఎస్‌డీ అయూబ్ 587, బి.పౌర్ణమి 586, జె.కార్తీకదేవి 586, ఎల్.దినేష్‌పవన్‌సాయి 584, జి.హాసిని రిత్విక్ 583, కేవీవీఎస్ వాసవిలక్ష్మి 581, కె.హుమేష్‌బాలసాయి సుభాష్ 580 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, కేవీ సత్యనారాయణ, బి.యుగసుధ అభినందించారు.

'పది' ఫలితాల్లో శశి విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులతో శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్

ఉండ్రాజవరం : పదో తరగతి పరీక్షల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ సోమవారం చెప్పారు. హనుమంతు గాయత్రి 596 మార్కులు, పి.కృష్ణ నాగ సాహితి 595, ఎన్.సూర్యతేజ 594, కె.సత్యవాణి, పి.రణరామ్, ఎన్‌జె.విజయదుర్గ 593, జి.సత్య శ్రీహర్ష, సీహెచ్ బిందుజ, బి.వైష్ణవి కావ్య 592, ఎస్.వర్షిత, పి.ప్రణవి సాత్విక, కె.శ్రీరామ్ శ్రవణ్, సీహెచ్ బద్రి, వి.తన్మయి, కేఎస్ క్రిష్ణ లక్ష్మి తేజస్విని, ఎల్.మణిగుప్త 591, సీహెచ్ జ్ఞానేశ్వరి, సీహెచ్.శాంతిప్రియ, కె.నరసింహ గుప్తా, బి.నిత్య హర్షిత 590 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ అభినందించారు.

టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో అగ్ని ప్రమాదం


దగ్ధమైన కాయిల్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లోని సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో టెలిఫోన్ కాయిల్స్ దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. టెలిఫోన్ వేవ్ గైడ్ కాయిల్స్ ఐదు డ్రమ్‌లకు నిప్పు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. బీఎస్ఎన్ఎల్ సిబ్బంది వెంటనే గమనించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ఫైర్ అధికారి గణేశ్న వెంకట రామారావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రమాదం కారణంగా టెలీఫోన్ ఎక్స్ఛేంజ్ చుట్టుపక్కల బ్యాంకులు, ఆసుపత్రులు, లాడ్జిలు ఉండటంతో మంటలను చూసి ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. మంటలు అదుపులోకి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వైఎస్సార్ సీపీలోకి సగర సంఘీయులు


తాడేపల్లిగూడెంలో డిప్యూటీ సీఎం కొట్టు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన సగర సంఘీయులు


నత్తారామేశ్వరం మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

తాడేపల్లిగూడెం రూరల్: మోదుగగుంట గ్రామానికి చెందిన సగర సంఘీయులు సోమవారం సగర కార్పొరేషన్ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం తాడేపల్లిగూడెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి డిప్యూటీ సీఎం కొట్టు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. సగర సంఘ నాయకులు కర్నాటి నాగేశ్వరరావు, మెండ్యాల ఏడుకొండలు, యడవల్లి సుబ్బారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ శాంతి భద్రతల పరిరక్షణకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. తమ సంఘీయులంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణ, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించుకుంటామన్నారు. ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందరరావు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులురెడ్డి, నాయకులు గుండుమోగుల సాంబయ్య, చీకటిమిల్లి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు సమక్షంలో..

పెనుమంట్ర: నత్తారామేశ్వరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆగ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చవ్వాకుల లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పార్టీ కార్యాలయంలో వారిద్దరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈనెల 24న నత్తారామేశ్వరం గ్రామంలో జరిగే పార్టీ ఎన్నికల ప్రచారాన్ని తామంతా ఐకమత్యంతో పనిచేసి, పార్టీ బలపడటానికి మరింత కృషిచేస్తామని, వచ్చే ఎన్నికల్లో ఆచంట ఎమ్మెల్యేగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పార్లమెంట్ అభ్యర్థిని గూడూరి ఉమాబాలకు ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేయించడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయడానికి తమవంతు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, గ్రామసర్పంచ్ వెలగల ధర్మారెడ్డి, ఉప సర్పంచ్ మల్లిడి కిరణ్‌కుమార్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కర్రి రామారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షులు తమనంపూడి అయ్యప్పరెడ్డి, కర్రి ప్రభాకరరెడ్డి, మహిళా నాయకురాలు కర్రి హిమబిందు పాల్గొన్నారు.

పోలీసులపై చింతమనేని జులుం

- ఏలూరు కలెక్టరేట్ వద్ద హడావిడి
- మరోసారి నోరుపారేసుకున్న చింతమనేని


ఏలూరు కలెక్టరేట్ వద్ద పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న చింతమనేని

ఏలూరు టౌన్: అధికారులపై దౌర్జన్యం, దాడులు చేస్తూ నిత్యం వార్తల్లో నిలిచే దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరోసారి తన నోటి దురుసును ప్రదర్శించారు. ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏలూరు కలెక్టరేట్ వద్దకు వెళ్లిన చింతమనేనిని పోలీసులు అడ్డుకోవడంతో రెచ్చిపోయారు. ×ఓవరాక్షన్ చేయవద్దని చెప్పు.... చేస్తే ఏం చేయాలో నాకు తెలుసు.. మీకు రెండు నిమిషాలే సమయం ఉంది.. నా స్ట్రెంగ్త్ ఎంతో తెలుసా.. ఏమీ లేకుండా బిల్డప్‌లు ఇవ్వొద్దు మీరంతా॥ అంటూ విరుచుకుపడ్డారు. మేము 60 లక్షల మంది ఉన్నాం.. పోలీసులు మీరు ఎంతమందో తెలుసుగా.. అంటూ హుంకరించారు. మేము ప్రజా సేవకులం.. మీరు డబ్బులకు పనిచేస్తారు.. అంటూ చులకనగా మాట్లాడుతూ పోలీసులకు హెచ్చరికలు చేశారు. దీంతో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న పోలీసు కానిస్టేబుళ్లు చింతమనేని మాటలకు ఏం చెప్పాలో తెలియక నిశ్చేష్టులయ్యారు. చింతమనేని ధోరణి మారకపోవడంతో పోలీసులు అతని తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రాట్నాలమ్మ తిరునాళ్ల

పెదవేగి : రాట్నాలకుంటలో వేంచేసియున్న శ్రీరాట్నాలమ్మ అమ్మవారి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు జరిగే తిరునాళ్లకు రాట్నాలమ్మ దేవస్థానం ముస్తాబైంది. భక్తుల పాలిట కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన రాట్నాలమ్మ ఆవిర్భావం తూర్పుచాళుక్యుల కాలంలోనే జరిగింది. రాజవంశం రత్నాలు సమర్పించి కోరిన కోరిక మేరకు ఈ వేంగిపుర ప్రాంతంలో అమ్మవారు ఒక చేతిలో ఖడ్గంతో మరో చేతిలో కలశాలతో పులివాహనంపై ఈ ప్రాంతంలో రత్నలమ్మగా వెలసింది. బ్రహ్మ, ఈశ్వరుడు, విష్ణువు, కాలభైరవుడు, కుమారస్వామి, చతుర్భుజ దుర్గాదేవి, షడ్భుజదుర్గాదేవి, సుబ్రహ్మణ్యస్వామి సప్తమాతృకలు వైదేహి సూర్య ఉషాదేవి తదితర పరివార దేవతలతో అమ్మవారు ఇక్కడ కొలువై ఉంది. నాటి రత్నలమ్మ నేటి రాట్నాలమ్మగా ప్రసిద్ధి చెందింది.

ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి నుంచి..

ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి నుంచి ఐదు రోజుల పాటు అమ్మవారి తిరునాళ్లు వైభవంగా నిర్వహిస్తారు. తిరునాళ్ల విజయవంతానికి ఆలయ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

భోగాపురంలో వ్యక్తి దారుణ హత్య

- పాతకక్షలే కారణం.. కత్తితో దాడి
- ఘటనా స్థలంలోనే మృతి


రక్తపు మడుగులో రంగారావు మృతదేహం

పెదవేగి: పాతకక్షల నేపథ్యంలో మండలంలోని భోగాపురం గ్రామంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పెదవేగి ఎస్సై వి రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భోగాపురం గ్రామానికి చెందిన పామర్తి రంగారావు (44), అదే గ్రామానికి చెందిన మండపాక వరప్రసాద్ మధ్య పాతకక్షలు ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం రంగారావు గ్రామంలోని ఓ దుకాణం వద్దకు రాగా, అక్కడ వరప్రసాద్, రంగారావు మధ్య మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. ఇది పెద్దదై వరప్రసాద్ కోపంతో తనకు అందుబాటులో ఉన్న కత్తితో దాడి చేసి రంగరావు పక్కటెముకల వద్ద పొడిచాడు. అనంతరం మెడపై కత్తితో నరకడంతో రంగారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్సై రాజేంద్రప్రసాద్ వెంటనే ఘటనా స్థలానికి హత్యకు గల కారణాలపై స్థానికుల నుంచి వివరాలు ఆరా తీశారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 112 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు 67 మందికి 64 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని డీఈఓ ఎస్.అబ్రహాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఎల్ఈడీ ఒకటో సెమిస్టర్ పరీక్షకు 50 మంది అభ్యర్థులకు 48 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్)/కామవరపుకోట: అత్యాచారయత్నం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి సోమవారం తీర్పు వెలువరించారు. ఏపీపీ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెంకు చెందిన నిందితుడు నిజవరపు సత్యనారాయణ అలియాస్ సత్తియ్య 2015 డిసెంబర్ 17న సాయంత్రం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మేకలు మేపుకోవటానికి వెళ్ళిన ఓ మహిళపై వెనుక వైపు దాడి చేసి,అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న బాధితురాలి తండ్రి, మరికొందరు స్థానికులు రావడంతో నిందితుడు ఆమెను వదిలేసి పరారయ్యాడు. దీనిపై బాధితులు గ్రామంలోని పెద్దలకు మొరపెట్టుకున్నారు. నిందితుడు పెద్దల వద్దకు రాకపోవడంతో బాధితురాలు తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై జీజే విష్ణువర్ధన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ చేసి నిందితుడు నిజవరపు సత్యనారాయణను అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీషీట్ ఫైల్ చేశారు. కేసు విచారణలో ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదనలు వినిపించారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి జి.రాజేశ్వరి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పును వెలువరించారు. తడికలపూడి ఎస్సై ఎం.జైబాబు, కోర్టు కానిస్టేబుల్ కొండలరావు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

క్లుప్తంగా

పేదల ప్రభుత్వాన్ని కాపాడుకుందాం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



వైఎస్సార్ సీపీలో చేరిన గ్రామ ఉపసర్పంచ్ చెరుకు సూర్యనారాయణకు కండువా వేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని పాద యాత్ర లో ఇచ్చిన మాటకు కట్టుబడి నూరుశాతం పథకాలు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పలు గ్రామాలు పర్యటించారు. గ్రామ కూడళ్లలో మాట్లాడారు. ఈ సందర్భంగా జట్లపాలెం గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ చెరుకు సూర్యనారాయణ (హనుమంతు) మంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్నను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల కనకసుందర్రావు, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, మాజీ సర్పంచ్ కట్టుబోయిన భాస్కరరావు, పార్టీ అధ్యక్షులు కుదుళ్ల భాస్కరావు, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, ఎస్సీ నాయకులు గుమ్మళ్ల రత్నరాజు, మీసాల మోషేన్, దాసి బాబు, గంజి ఏసు, అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొంతువారిపాలెంలో ఎన్నికల ప్రచారం



బొంతువారిపాలెంలో ఎన్నికల ప్రచారంలో ఓట్లను అభ్యర్థిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అల్లుడు దిలీప్‌కుమార్

అత్తిలి: అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందజేయడంతో పాటు వైఎస్సార్ సీపీ పాలనపట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అల్లుడు దిలీప్‌కుమార్ చెప్పారు. సోమవారం అత్తిలి శివారు బొంతువారిపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సెంట్ ఆన్స్ విద్యార్థుల విజయదుందుభి




విద్యార్థులను అభినందిస్తున్న సెంట్‌ఆన్స్ సంస్థల అధినేత అద్దంకి విజయకుమార్

తాడేపల్లిగూడెం: పదోతరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు విజయదుందుభి మోగించారని సెంట్ ఆన్స్ సంస్థల అధినేత అద్దంకి విజయకుమార్ సోమవారం తెలిపారు.కొవ్వూరి సుహాసిని 595 మార్కులు సాధించారన్నారు. కె.నిఖిల్, ఎం.శరత్‌శోభితలు 593 మార్కులు సాధించారని తెలిపారు. పి.సాయికార్తీక , ఎం.భవ్యశ్రీ, జి.సత్యరిషితలు 592 మార్కులు, బి.దినేష్ నాగేంద్ర, జిచేతన్ వాసుదేవ్‌లు 591 మార్కులు పొందారు. 550 కంటే ఎక్కువ మార్కులు 63 మంది పొందగా, 98 మంది 500 కంటే ఎక్కువ మార్కులు పొందారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విజయకుమార్ అభినందించారు.

సన్‌షైన్ విద్యార్థుల ప్రభంజనం



జి.సూరజ్ కుమార్ (585)



ఎస్.ప్రవీణ్ (580)

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతి పరీక్షా ఫలితాల్లో సన్‌షైన్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 20 మంది విద్యార్థులకు 20 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల ప్రథమ స్థానం జి.సూరజ్ కుమార్ (585), ద్వితీయ ఎస్.ప్రవీణ్ (580), తృతీయ ఎస్.ఉదయ మణి మంజుల (574)లు సాధించారు. విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీ శ్రీనివాసులు, జి.ప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

రహదారులకు రాచబాట



తణుకు ఆర్టీసీ బస్ స్టేషన్ నుంచి అక్కమాంబ టెక్స్‌టైల్స్ వరకూ నిర్మించిన సీసీ రోడ్డు



తణుకు కొమ్మాయి చెరువు నుంచి వీరభద్రపురం రోడ్డు వరకూ నిర్మించిన బీటీ రోడ్డు

- మంత్రి కారుమూరి చొరవతో రోడ్ల అభివృద్ధి
- టీడీపీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన రోడ్లవి

తణుకు టౌన్: 2014 నుంచి 2019 వరకూ టీడీపీ హయాంలో ఈ ప్రాంతంలోఇసుక, మట్టి మాఫియా కారణంగా భారీ ట్రక్కుల రాకపోకలతో దెబ్బతిన్న రహదారులవి. గుంతలమయంగా మారిన రోడ్ల వల్ల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నా నాడు ఏ ఒకరూ పట్టించుకోలేదు. అఖరికి అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అరిమిల్లి రాధకృష్ణ హయాంలోనే మొక్కుబడి మరమ్మతులే తప్ప కనీసం ఒక్కటంటే ఒక్క రోడ్డైనా వేయించలేకపోయారన్న అపవాదు ప్రజల్లో మూటగట్టుకున్నారు. మరోవైపు మంత్రి కారుమూరి హయాంలో రోడ్లన్నీ బాగుచేశారు. చెప్పినట్లుగానే ప్రధాన రహదారులన్నింటినీ రాచబాటలుగా మార్చి పూర్తిస్థాయిలో ఆధునీకరించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ప్రస్తుతం ఈ రహదారుల అంశం ప్రజల్లో చర్చనీయాంశమైంది. తణుకు పట్టణ పరిధిలో సుమారు దశాబ్ద కాలంగా మరమ్మతులకు నోచుకోని రోడ్లను అభివృద్ధి చేసిన ఘనత మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకే దక్కుతుంది. ప్రస్తుత మంత్రి కారుమూరి తన మొదటి సారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేపట్టిన రోడ్ల అభివృద్ధి మళ్లీ పది సంవత్సరాల తర్వాత తణుకు నియోజకవర్గంలోని ఆర్ అండ్ బీ రోడ్లకు రూ.150 కోట్లతో అభివృద్ధి చేశారు. తణుకు పట్టణం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లను ప్రస్తుత పాలనలో ఎంతో నాణ్యతతో నిర్మాణం పూర్తి చేశారు. తణుకు పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి వెంకట్రాయపురం మీదుగా అక్కమాంబ టెక్స్‌టైల్ నుంచి తణుకు వేల్పూరు రోడ్డును కలిపే ఆర్ అండ్ బీ రోడ్డును రూ.1 కోటి 70 లక్షలతో సీసీ రోడ్డుగా నిర్మించడంతో ఈ రోడ్డులో నిత్యం ప్రయాణించే మండపాక, పైడిపర్రు గ్రామాల ప్రజలకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం గోతుల రోడ్డులో ఎన్నో అవస్థలు పడే రోజుల నుంచి నాణ్యమైన సీసీ రోడ్డు ప్రయాణం అప్రాంత వాసులకు ఎంతో మేలు చేసిందని పేర్కొంటున్నారు. వర్షా కాలంలో కురిస్తే భారీ వర్షాలకు సత్యవాడ డ్రెయినేజీ పొంగి ఆము రుగునీరు ఈరోడ్డుపై గోతుల్లో నిలిచిపోవడంతో రైల్వే, బస్ ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం సీసీ రోడ్డు నిర్మాణంతో ఆ రోడ్డులో ప్రయాణాలు సాగించే మండపాక, పైడిపర్రు, వెంకట్రాయపురం తదితర ప్రాంతాల ప్రజలు మెరుగైన రోడ్డు సౌకర్యం ఏర్పడిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. తణుకులోని కొమ్మాయి చెరువు వద్ద నుంచి వీరభద్రపు రోడ్డు వరకూ ఉన్న 2.45 కిలో మీటర్ల పంచాయతీ రాజ్ రోడ్డును ఇటీవల రూ. 1 కోటి 13 లక్షలతో బీటీ రోడ్డుగా నిర్మాణం చేశారు. దీనితో నిన్నటి వరకూ గోతుల మయంగా ఉన్న రోడ్డు ఈరోజు బీటీ రోడ్డుతో మారడంతో తణుకు పాతూరు నుంచి వీరభద్రపురం, వేల్పూరు వెళ్లే వారికి బైపాస్ రోడ్డుగా అందుబాటులోకి వచ్చింది. తణుకు పట్టణానికి ఇరువైపులా ఈ రోడ్లు అభివృద్ధి చేయడంతో వీరభద్రపురం, వేల్పూరు, రేలంగి తదితర గ్రామాల ప్రజలకు సమస్య తొలగిపోయింది.

అప్పట్లో చాలా ఇబ్బంది పడేవాళ్లం



మండపాక, పైడిపర్రు, ప్రాంతాల నుంచి తణుకు రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌కు రావాలంటే గోతుల రోడ్డుతో ఇబ్బందులు చాలా ఇబ్బందులు పడ్డాం. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముందుచూపుతో తణుకు బస్ స్టాండ్ పైడిపర్రు వైపు నుంచి మండపాక రైల్వే గేటు, అక్కమాంబ్ టెక్స్ టైల్స్ వరకూ ఉన్న రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడంతో ప్రజలకు చాలా ప్రయోజనం కలిగింది. ఈరోడ్డు గతంలో బీటీ రోడ్డుగా అప్పటి ఎమ్మెల్యే కారుమూరి వెంకట నాగేశ్వరరావు నిర్మించారు. ఇప్పుడు ఆయనే ఈరోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు.

– ఇందుగపల్లి బలరామకృష్ణ, పట్టణ సచివాలయ జేసీఎస్ కన్వీనర్, తణుకు

మంత్రి కారుమూరి చొరవతోనే..



పట్టణంలోని కొమ్మాయి చెరువు నుంచి వీరభద్రపురం రోడ్డు వరకూ ఉన్న పంచాయతీ రాజ్ ఆధీనంలో ఉన్న రోడ్డు పట్టణానికి బైపాస్ రోడ్డుగా ఉంటుంది. దీనిని గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కారుమూరి నాగేశ్వరరావు బీటీ రోడ్డుగా నిర్మించారు. అనంతరం ఈరోడ్డు గోతులు పడి ప్రయాణీకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా ఎవరూ పట్టించుకోలేదు. మళ్లీ తిరిగి మంత్రి కారుమూరి చొరవతోనే రూ. 1.13 కోట్లతో బీటీ రోడ్డుగా నిర్మించారు. ప్రజలందరూ మంత్రి కారుమూరికి రుణపడి ఉంటాం.

– గనసాల సింగ్, వైఎస్సార్ సీపీ నాయకుడు, వీరభద్రపురం.

'పది'లో తణుకు శశి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న తణుకు శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, తదితరులు

తణుకు టౌన్: పదో తరగతి పరీక్షలలో తణుకు శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాల కృష్ణ తెలిపారు. సోమవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తణుకు శశి ఇంగ్లీష్ మీడియ స్కూల్ విద్యార్థులు 600 మార్కులకు తమ విద్యార్థులు వెలగల స్రవంతి 594 మార్కులు, కోటిపల్లి జ్ఞాన అమృత 593 మార్కులు, బండారు సుబ్రహ్మణ్యం 592 మార్కులు, బాలనాగు ఫణి జ్యోత్స్న కర్రి వెంకట తేజారెడ్డిలు 591 మార్కులు, తోట శ్రీనైసీ, వసంతాడ ప్రసన్నలు 590 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శశి విద్యా సంస్థల చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, పాఠశాల హెచ్ఎం నాదెళ్ల ప్రసాద్, కాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్ అభినందించారు.

ఎస్‌వీఎస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పది పరీక్షల్లో తణుకులోని ఎస్‌వీఎస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ సాధించినట్లు ప్రిన్సిపాల్ డీ కేశవరావు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు కే కావ్య 600 మార్కులకు 580 మార్కులు, బీసీహెచ్ రెడ్డి 569 మార్కులు, ఏ అజయశ్రీ 553 మార్కులు, టీ వైష్ణవి 551 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను స్కూల్ డైరెక్టర్లు కే రామ్‌కుమార్, యం సూరిబాబు, డి రవితేజలు అభినందించారు.

గంధం జోన్స్ విద్యార్థుల విజయకేతనం

తాడేపల్లిగూడెం: పదోతరగతి ఫలితాల్లో గంధం జోన్స్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పాఠశాలకు చెందిన కె.నవ్యశ్రీ 593 మార్కులు , బి.మోక్షిత 588 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులకు గంధం సుధాకర్, శకుంతలాదేవి, గంధం ప్రభాకర్‌లు అభినందనలు తెలిపారు.

నాగబాబు నాకు కొండంత అండ

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



వైఎస్సార్ సీపీలో చేరిన యెగ్గిన నాగబాబును పార్టీ కండువాతో ఆహ్వానిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో కూటమికి కోలుకోలేని రీతిలో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. టీడీపీ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ వ్యవస్థాపకుడు ఎగ్గిన నాగబాబు వైఎస్సార్ సీపీలో చేరారు. డిప్యూటీ సీఎం, తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ సమక్షంలో నాగబాబు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు మంత్రి కొట్టు పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ నాగబాబు పార్టీలో చేరడం నాకు కొండంత అండ అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి పరిపాలనకు ఆకర్షితులై పార్టీలోకి నాగబాబు వచ్చారన్నారు. దేశ వ్యాప్తంగా జగన్ పాలనను కొనియాడుతున్నారని కొట్టు చెప్పారు. రాష్ట్రంలో జగన్ మేమంతా సభకు ప్రజలు తండోపతండాలుగా రావడం పట్ల రాష్ట్ర ప్రజలందరూ జగన్‌కే మద్దతు పలుకున్నారని తెలుస్తుందన్నారు. నాగబాబు, తాను గతంలో అనేక సందర్భాల్లో కలిసి పట్టణ రాజకీయం అంశాలతో పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు చేశామన్నారు. మళ్ళీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నేడు నియోజకవర్గంలో అందులోను ప్రత్యేకించి పట్టణంలో నేర ప్రవృత్తి కలిగిన అసాంఘిక శక్తులన్నీ ఏకమై ఈ ఎన్నికల్లో జులుం ప్రదర్శించాలని ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇటువంటి తరుణంలో నిబద్ధత కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన నాగబాబు తనకు మద్దతుగా అండగా నిలబడేందుకు పార్టీలో చేరడం చాలా సంతోషకరమన్నారు. సంక్షేమం, అభివృద్ధి, శాంతి భద్రతలను కోరుకునే వారంతా ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తనకు అండగా నిలబడేందుకు ముందుకు రావాలని మంత్రి కొట్టు కోరారు. తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం పట్టణంలో అసాంఘిక శక్తుల అరాచకాలు సాగనివ్వనని హెచ్చరించారు. రౌడీలు, గుండాలు, పేకాటరాయుళ్లు, సెటిల్మెంట్ గ్యాంగులు రెచ్చిపోవాలని చూస్తే అలాంటి వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేస్తానని హెచ్చరించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. తిరిగి వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు వారంతా సంసిద్ధులుగా ఉన్నారన్నారు. అలాగే తాడేపల్లిగూడెంలో అభివృద్ధికి, శాంతి భద్రతలకు కొట్టు సత్యనారాయణ నాయకత్వాన్ని బలపరచాలని వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. తాడేపల్లిగూడెం వరకు ఈ ఎన్నికలు చాలా కీలకమని, ప్రతి ఒక్కరు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నాగబాబు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరరావు, పసల చంటి, మునగాల బాబ్జి, గుండుమోగుల సాంబయ్య, కొలుకులూరి ధర్మరాజు, పెనుమర్తి తాతారావు, ఆరమిల్లి రవి, కొలనువాడ సత్యనారాయణరాజు, రెడ్డిపల్లి మోహనరావు, కొలనుఆడ సీతారామరాజు, కొలనువాడ హరికృష్ణ, కైకాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అరాచక ముఠాకు తగిన గుణపాఠం తప్పదు

తాడేపల్లిగూడెం అర్బన్: తన ద్వారా ఉపకారం పొందిన కొందరు ఇప్పుడు అపకారం చేస్తూ విశ్వాస ఘాతుకానికి పాల్పడుతున్నారని ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జనసేనలో చేరిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి తాను దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తనతో తిరుమల తిరుపతికి తీసుకొని వెళ్లి అతనికి వేంకటేశ్వరస్వామి వారి దివ్యదర్శనం చేయించానని కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆ సమయంలో ఆ వ్యక్తి ఇటువంటి దర్శనం తన జన్మలో జరగలేదని ఇంతటి అదృష్టాన్ని కల్పించిన నన్ను ఎన్నడూ వీడనని తన వెంటే ఉంటానన్న ఆ వ్యక్తి ఇప్పుడు అపకారానికి పాల్పడుతున్నాడని మంత్రి కొట్టు అన్నారు. ఆ వ్యక్తి జనసేనలో చేరి అరాచక వ్యక్తులతో కలిసి తనపై విమర్శలు చేస్తున్నాడని మంత్రి కొట్టు ఆరోపించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు ఆ అరాచక ముఠాకు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మే నెలలో జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని మంత్రి కొట్టు కోరారు.

ముగ్గురూ ముగ్గురే.. ప్రచారంలో హేమాహేమీలు



ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల

తాడేపల్లిగూడెం: ఎన్నికలంటేనే ఆసక్తికర పరిణామాలు కనిపిస్తుంటాయి. మిత్రులు శత్రువులవుతారు.. శత్రువులు మిత్రులవుతారు. రాజకీయాల్లో ఇవేమీ శాశ్వతం కాదు అనడానికి బిగ్‌ఫ్రేమ్‌లో కనిపిస్తున్న ఈ ముగ్గురే సాక్ష్యం. ఎమ్మెల్యేలుగా వారి పాలనలో ప్రత్యేక ముద్ర వేసుకున్న వారే వీరంతా. అవినీతిరహిత పాలనతో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఎన్టీఆర్‌కు విధేయుడుగా 'కనకం' అని ముద్దుగా పిలుచుకునే మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర రావు. ప్రజారాజ్యం పార్టీ నుంచి ఉమ్మడి పశ్చిమలో ఒకేఒక్కడుగా విజయదుందుభి మోగించి మచ్చలేని పాలనకు ప్రజలకు అందించి ఈలినానిగా పిలుచుకునే ఈలి వెంకటమధుసూదనరావు. తాడేపల్లిగూడెం రాజకీయ చరిత్రలో 30 ఏళ్ల నుంచి నిరాఘాటంగా రాజకీయాల్లో ఉంటూ ఏడోసారి పోటీకి సిద్ధపడుతూ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా పేరొందిన డిప్యూటీ సీఎం , దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ. ఈ ముగ్గురూ గతంలో వేర్వేరు నేపథ్యాలు, పార్టీల్లో ఉన్న వారు అయినా ఈసారి ఎన్నికలకు సమన్వయంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ ప్రచారంలో పాలుపంచుకోవడం ఆకట్టుకుంటుంది.

'పది' ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు



593 మార్కులు సాధించిన విద్యార్థికి నగదు బహుమతిగా అందజేస్తున్న డైరెక్టర్ ప్రకాశరావు



తణుకులో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో రూట్స్ డైరెక్టర్స్

తణుకు అర్బన్: తణుకు మాంటిస్సోరీ స్కూలు విద్యార్థులు పదో తర గతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. సీహెచ్ జయకిరణ్ అనే విద్యార్థి 593 మార్కులు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. వి.గీతిక, జి.ప్రతిక్ రాజ్ ఇద్దరూ 592 మార్కులు సాధించి స్కూల్‌లో రెండో స్థానంలో నిలిచారని వివరించారు. స్కూల్ లో మొదటి స్థానం సాధించిన విద్యార్థి జయకిరణ్‌కు రూ.37,500లు నగదు బహుమతి అందజేశారు.

రూట్స్ స్కూల్‌లో...

తణుకు రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ప్యాకల్టీస్‌లో పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ ఎల్‌కే త్రిపాఠి తెలిపారు. హాజరైన 173 మంది విద్యార్థుల్లో పి.సుమేధా 590 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. టి.రేణుశ్రీ 584, ఎస్ లావణ్య, ఎస్ కిరణ్‌కుమార్‌రెడ్డి 583, కె.మోహన సూర్య తేజస్విని 580 మార్కులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను స్కూల్ డైరెక్టర్స్ ఎల్‌కే త్రిపాఠి, బి.విద్యాకాంత్, ఎస్.సుధాకర్‌వర్మ అభినందించారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

- ప్రతి కుటుంబానికీ లబ్ధి
- గ్రామాల్లో విస్తృతంగా వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం



తేతలిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు అర్బన్: రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమం కొనసాగాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుమార్తె దీపిక అన్నారు. తణుకు 24వ వార్డులో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. ప్రతి నెలా 1వ తేదీన అవ్వా తాతలకు ఇంటి వద్దకే పింఛను అందాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలన్నారు. తణుకు నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ అభ్యర్థిగా మంత్రి కారుమూరికి, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపైనేవేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు సూకల కనకదుర్గ, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు ఆకుల కిరణ్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షురాలు ఫహీమా, ఉండ్రాజవరపు గీత, ఝాన్సీ లారెన్స్, చంద్రకళ, కొమ్మోజు రామకృష్ణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

తణుకు టౌన్: తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో ముమ్మరంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు, పంచాయితీ సభ్యులు, ఇతర నాయకులు, కార్యకర్తలతో గ్రామంలోని ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. తేతలి గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సొసైటీ అధ్యక్షుడు పీ సతీష్ రాజు, నాయకులు, దారం శ్రీను, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, వలవల కిషోర్, సత్యనారాయణ, మానేపల్లి సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, యల్లమిల్లి రమేష్ బాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.